నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

11 | హైదరాబాద్, శనివారం 24 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI


## మార్చి 5 నుంచి గుట్టలో మహా శివరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను వచ్చే నెల 5నుంచి 10 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. 5న ఉదయం 10.30 గంటలకు స్వస్తివాచనం, 6న ఉదయం ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 7వ తేదీ రాత్రి 7 గంటలకు పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవం, 8న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకం, రాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, 9న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష బిల్వార్చన, 10న మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవం జరిపించనున్నట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ. 516, మహాశివ రాత్రి రోజున జరిగే అభిషేకానికి రూ 300, శత రుద్రాభిషేకానికి రూ. 516, లక్ష బిల్వార్చనలో పాల్గొనే భక్తులు రూ. 516 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

# సాగుకు డేంజర్ బెల్స్

**జిల్లాలో సాగు నీటి కష్టాలు**

**పెద్ద సంఖ్యలో ఎండిపోతున్న చెరువులు**

- రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోరుబావులు.. ఎండిపోతున్న వరి పొలాలు
- లబోదిబోమంటున్న అన్నదాత
- రానున్న రోజుల్లో మరింత నీటి వెతలు



వలిగొండ మండలం కంచనపల్లిలో నీళ్లు అందక ఎండిపోతున్న వరి పొలం

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : బీడు వారి ఎక్కడపడితే అక్కడ పిచ్చి మొక్కలు.. ముళ్ల పొదలు.. కంపచెట్లు ఇవీ ఉమ్మడి రాష్ట్రంలో చెరువుల పరిస్థితి. తెగిన కట్టలు, మరమ్మతులకు నోచుకోని చెరువులు దర్శనమిచ్చేవి. కానీ బీఆర్ఎస్ పాలనలో మిషన్ కాకతీయతో చెరువులకు మంచి రోజులు వచ్చాయి. మండు వేసవిలోనూ చెరువులు నిండు కుండలా దర్శనమిచ్చాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మళ్లీ పునరావృతం అవుతున్నది. చెరువులు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోరుబావులు వట్టిపోతున్నాయి. ఫలితంగా సాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలోని కొన్ని చోట్ల పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నీటి కోసం కేసీఆర్ ముందు చూపుతో మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టారు. జిల్లాలో మిషన్ కాకతీయలో భాగంగా 733 చెరువుల్లో పూడిక తీశారు. మొదటి విడుతలో రూ. 62.4 కోట్లతో 163 చెరువులు, రెండో విడుతలో రూ.76 కోట్లతో 203 చెరువులు, మూడో విడుతలో రూ.70.78 కోట్లతో 240 చెరువులు, నాలుగో విడుతలో రూ.25.90 కోట్లతో 127 చెరువుల్లో పూడిక తీశారు. దాంతో మండుటెండల్లోనూ చెరువులు నిండుకుండల్లా దర్శనమిచ్చాయి. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నీళ్లు లేక చెరువులు ఎండిపోతున్నాయి. వేసవి రాక ముందే తటాకాల్లో నీళ్లు తగ్గిపోయాయి. జిల్లాలో 799 చెరువులు ఉన్నాయి. వీటిల్లో 167 చెరువుల్లో 25 శాతంలోపు, 160 చెరువుల్లో 25 నుంచి 50శాతం నీళ్లు ఉన్నాయి. మూసీ పరీవాహక ప్రాంతాలైన భూదాన్ పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్, రామన్నపేట చెరువుల్లో పరిస్థితి బాగానే ఉందని అధికారులు చెబుతున్నారు.

### వట్టిపోతున్న బావులు



నీటిమట్టం తగ్గిన యాదగిరిగుట్ట మండలం మల్లాపురం చెరువు

చెరువులు ఎండిపోతుండగా మరోవైపు భూగర్భ జలాలు సైతం ఇంకిపోతున్నాయి. నెల నెలా నీటి నిల్వలు పడిపోతున్నాయి. గతేడాది జనవరిలో 4.91మీటర్లలో భూగర్భ జలాలు ఉండగా ఈ ఏడాది జనవరి నాటికి 7.29 మీటర్లకు పడిపోయింది. ఇక మండలాల వారీగా చూసుకుంటే ఆత్మకూర్ (ఎం)లో 12.38, నారాయణపురంలో 10.38, తుర్కపల్లిలో 9.63, బొమ్మలరామారంలో 9.24 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయి. నీటి మట్టం పడిపోవడంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. కొన్ని చోట్ల బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి.

### ఎండుతున్న పంటలు..

జిల్లాలో అధిక శాతం మంది వరి పంట సాగు చేశారు. ఇప్పటికే అన్ని చోట్లా పొట్ట దశకు వచ్చింది. ఈ సమయంలో సరిపడా నీరు అవసరం. కానీ అటు చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు ఇంకిపోవడం, బోర్లు వట్టిపోవడంతో నీరు దొరకడం కష్టమవుతున్నది. దాంతో రైతులు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. భువనగిరి మండలంలోని పలు గ్రామాలు, గుండాల, అడ్డగూడూరు, మోటకొండూరు తదితర మండలాల్లో పొలాలు ఎండిపోయాయి. ఏం చేయలేక రైతులు లబోదిబోమంటున్నారు.

### కౌలు ఎట్ల కట్టాలో అర్థమైతలేదు



మా ఊళ్లో 7 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసిన. పెట్టుబడికి అప్పులు తెచ్చిన. నాట్లు వేయించి ఎరువులు, మందులు చల్లిన. ఇప్పుడు నీళ్లు లేక పొలం పారుత లేదు. ఇప్పటికే రెండు ఎకరాల పొలం ఎండిపోయింది. చేసేదేం లేక గొర్ల మేతకు ఇచ్చిన. రోజురోజుకు బోర్లల్లో నీళ్లు తగ్గుతున్నాయి. మిగిలిన 5 ఎకరాలన్నా పారుడు కష్టంగానే ఉన్నది. ఈ మధ్య కాలంలో ఇటువంటి కరువు పరిస్థితి చూడలేదు. మాఊర్లో ఇప్పటికే 30 ఎకరాల వరకు చేతకొచ్చిన పంటలు ఎండినయ్. పరిస్థితి ఇట్నే ఉంటే 60ఎకరాల వరకు పంటలు ఎండిపోవచ్చు. నాలుగైదేండ్ల నుంచి బునాది కాల్వలో ఫిబ్రవరిలో నీళ్లుండేవి. ఈ సారి బునాదిగాని కాల్వ నవంబర్‌లోనే ఎండిపోయింది. ప్రభుత్వం వెంటనే బునాదిగాని కాల్వకకు నీళ్లు వచ్చేటట్టు చేసి రైతులు నష్టపోకుండా చూడాలి. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే అప్పులు, కౌలు ఎట్ల కట్టాలో అర్థమైతలేదు.

–సోలిపురం రాజ్‌కుమార్‌రెడ్డి, రైతు, కంచనపల్లి, వలిగొండ మండలం

# వైభవంగా రథోత్సవం

- పాతగుట్టలో దివ్య విమాన రథంపై లక్ష్మీనరసింహ స్వామి ఊరేగింపు
- భజనలు, కోలాటాలతో భక్తుల తన్మయత్వం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 : యాదగిరి గుట్టలోని పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్వామి, అమ్మవారి దివ్య విమాన రథోత్సవాన్ని శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారిని ముప్పై మూడు కోట్ల దేవతల సాక్షిగా వివాహమాడిన నరసింహ స్వామిని దివ్య విమాన రథంపై ఊరేగే తంతును ఆలయ ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు ఘనంగా చేపట్టారు. 'ఎదురులేని దొరను ఎదురేగి పిలిచేము' అంటూ కల్యాణ మూర్తులు రథంలో తరలివస్తుండగా భక్తులు తన్మయత్వంతో దర్శించుకున్నారు. అంతకు ముందు రథం ముందు పసుపు, కుంకుమ కలిపిన అన్నంతో బలిహరణం చేశారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను మల్లె, మందార, పున్నాగ, జాజి, వకుళ, కేతకి, చంపగ, మల్లిక వంటి పుష్పాలు, చంద్రహారం, ముత్యాలు, మువ్వలు, వగడాలు, వివిధ కంఠాభరణాలతో అలంకరించారు. రథంలోని ఆ పరమాత్మను దర్శిస్తే పునర్జన్మ ఉండదని నమ్మకం. మంగళవాయిద్యాల నడుమ భక్తులు భజనలు, కోలాటాలు వేస్తూ రథం ముందు నడిచారు. జై నారసింహ.. జయ జయ నారసింహ అంటూ భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు.

### గరుడ వాహన సేవలో కల్యాణ ఉత్సవ మూర్తులు

పాతగుట్ట బ్రహ్మోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం నిత్యారాధనల అనంతరం చతుర్వేద పారాయణాలు, నిత్య హవనములు, మూల మంత్ర, మూర్తి మంత్ర జపములు, లక్ష్మీ అష్టోత్తర నామ జపములను ఆలయ ప్రధానార్చకులు నల్లన్ థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణ ఉత్సవ మూర్తులను గరుడ వాహన సేవలో తిరువీధుల్లో ఊరేగించారు.

### సాంస్కృతిక సంబురం

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మల్లాపురానికి చెందిన శ్రీరామభక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళా భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు, హైదరాబాద్‌కు చెందిన డీఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో భక్తి సంగీతం, రాంపల్లికి చెందిన సాంస్కృతిక విశ్వ కళా మండలిచే నృత్య ప్రదర్శనలు వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, యాజ్ఞికులు కిరణ్‌కుమారాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థీఘళ్ సీతా మనోహరాచార్యులు, పారాయణందారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణుగోపాలాచార్యులు, ఆలయ అధికారులు శ్రీకాంత్, విజయకుమార్ పాల్గొన్నారు.

### నేడు చక్రతీర్థం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థం, సాయంత్రం 6 గంటలకు దేవతా ఉద్వాసన, శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, డోలోత్సవం నిర్వహించనున్నారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిగ్భ్రాంతి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 23 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయసులో శాసన సభ్యురాలిగా ప్రజల మన్ననలతో ఎన్నికైన ఆమె అర్థాంతరంగా దివంగతులు కావడం శోచనీయని పేర్కొన్నారు. ఆమె మరణం పట్ల ఆయన సంతాపం తెలిపారు. సాయన్న కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

### లాస్య నందితకు నివాళి



ఎమ్మెల్యే లాస్య నందిత ఫ్లెక్సీకి పూలమాల నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 23 : రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తాలో శుక్రవారం పలువురు నాయకులు ఆమె ఫ్లెక్సీకి పూలు చల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో భువనగిరి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్, ఆ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు, జడ్పీటీసీ సుబ్బూరు మల్లయ్య, రచ్చ శ్రీనివాస్, నాయకులు కొలుపుల అమరేందర్, అబ్బగాని వెంకట్ గౌడ్, అతికం లక్ష్మీనారాయణ, గోమరి సుధాకర్, నక్కల చిరంజీవి, రాచమల్ల రమేశ్, తాడెం రాజశేఖర్, సుభాశ్, సూరజ్, శివ, అజయ్, అంజత్, రహీమ్ పాల్గొన్నారు.

## స్టడీ సర్కిళ్లలో శిక్షణకు దరఖాస్తులు

నల్లగొండ, ఫిబ్రవరి 23 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. గ్రూప్–1, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్కొక్క స్టడీ సర్కిల్‌లో 100 మందికి రెసిడెన్షియల్ కోచింగ్ ఇస్తున్నారని, ఇందులో ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 15 శాతం సీట్లు ఉంటాయని చెప్పారు. మొత్తంగా 33 శాతం సీట్లు మహిళలకు, 5 శాతం సీట్లు దివ్యాంగులకు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. భోజనం, వసతి, ఉత్తమ ఫ్యాకల్టీతో శిక్షణ, స్టడీ మెటీరియల్స్, డిజిటల్ క్లాస్‌లు, రెఫరెన్స్‌కు వందలాది పుస్తకాలు, నిరంతర మూల్యాంకనానికి వారాంతపు పరీక్షలతో శిక్షణ ఐదు నెలలపాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. అర్హులై ఆసక్తి కలిగిన వారు http://tsstudycircle.co.in/ లో మార్చి 6, 2024 వరకు దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష హాల్ టికెట్లు మార్చి 7 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్ష మార్చి 10, 2024 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్టడీ సర్కిల్స్ ఉన్న జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. మార్చి 18 నుంచి ఆగస్టు 17 వరకు శిక్షణ ఉంటుందని, నలభై నాలుగేండ్ల లోపు వయసు కలిగి, డిగ్రీ ఉత్తీర్ణులై, సంవత్సరానికి మూడు లక్షల లోపు కుటుంబ ఆదాయం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8465035932, 9603167257, 9010895239 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో రాజకీయం

- రాష్ట్రంలో ఎక్కడ లేకున్నా నల్లగొండ నియోజకవర్గంలోనే ట్రాన్స్‌ఫర్స్
- కమిషనర్‌తో సంబంధం లేకుండా ఆదేశాలిచ్చిన కలెక్టర్

నల్లగొండ, ఫిబ్రవరి 23 : నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో కొంత మంది పంచాయతీ కార్యర్శులపై బదిలీ వేటు పడింది. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి కమిషనర్‌కు సంబంధం లేకుండా జిల్లా కలెక్టర్‌తో ఓ ఆర్డర్ జారీ చేస్తూ నియోజకవర్గం వ్యాప్తంగా 12 మందిని బదిలీ చేయించారు. ఒక్క కార్యదర్శికి ఇదే నియోజకవర్గంలో పోస్టింగ్ ఇచ్చినప్పటికీ మిగిలి వారిని దేవరకొండ, డిండి, చందంపేట, నేరేడుగొమ్ము వంటి దూర ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11 నుంచి జూనియర్ పంచాయతీల పోస్టింగులు జరుగగా, మెరిట్‌ను బట్టి కార్యదర్శులుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల స్థానచలనం లేకున్నప్పటికీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో నల్లగొండ నియోజకవర్గంలో జరుగడం గమనార్హం, ప్రధానంగా గ్రేడ్ –1, గ్రేడ్ –2 పంచాయతీ కార్యదర్శుల బదిలీలు పంచాయతీ రాజ్ కమిషనర్ పరిధిలో ఉండగా గ్రేడ్ –3, 4 పంచాయతీ కార్యదర్శుల బదిలీలు కలెక్టర్ పరిధిలో ఉంటాయి. నల్లగొండ నియోజకవర్గంలో దండంపల్లి, చందనపల్లి పంచాయతీ కార్యదర్శులు యాదగిరి, శ్రవణ్ గ్రేడ్ –1 అయినప్పటికీ వారిని బదిలీ చేయడం పలు విమర్శలకు తావిస్తున్నది. రెడ్డి కాలనీ పంచాయతీ కార్యదర్శి సుజితను కొత్తపల్లికి బదిలీ చేయగా, మిగతా 11 మందిని దేవరకొండ నియోజకవర్గానికి ట్రాన్స్‌ఫర్ చేయడంతో ఆయా కార్యదర్శులు ఆందోళన చేస్తున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల స్థానంలో ఓపీఎస్ కార్యదర్శులను బదిలీ చేశారు. మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అనుచరుడైన ఓ రాజకీయ నాయకుడు ఈ విషయంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీకి సానుభూతి పంచాయతీ కార్యదర్శులను ఇక్కడ నియమించి జూనియర్ పంచాయతీ రాత పరీక్షలో మెరిట్ మార్కులు సాధించి నల్లగొండ నియోజకవర్గంలో పోస్టింగులు సాధించిన వారిపై వేటు వేసినట్లు సమాచారం.



దామరచర్లలో యాదాద్రి పవర్ ప్లాంట్

# వెలుగుల కోవెల యాదాద్రి పవర్ ప్లాంట్

- రాష్ట్రంలో కరెంట్ కష్టాలను దూరం చేసేలా నిర్మాణం
- కాంగ్రెస్‌కు కలిసిరానున్న కేసీఆర్ ముందు చూపు
- ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి
- విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా రెండు యూనిట్లు
- అనుకూలంగా ప్రజాభిప్రాయ సేకరణ
- నేడు ప్లాంట్‌ను పరిశీలించనున్న మంత్రులు

దామరచర్ల, ఫిబ్రవరి 23 : రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను తీర్చడానికి నాటి సీఎం కేసీఆర్ దామరచర్ల మండలంలో రూ.34వేల కోట్లతో నాలుగు వేల మెగావాట్ల యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి పెట్టి నాటి సీఎండీ ప్రభాకర్‌రావు సమక్షంలో 80 శాతం పనులు పూర్తి చేశారు. ప్లాంట్ ఒకటి, ప్లాంట్ రెండు పనులు పూర్తి చేసుకొని ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయి. రెండు యూనిట్ల నుంచి 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానున్నది. కరోనా సమయంలో లాక్‌డౌన్‌లు లేకపోతే ఇప్పటికే యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రారంభమై వెలుగులిచ్చేది. వరుసగా రెండేండ్లు లాక్‌డౌన్ రావడంతో పదివేల మంది కార్మికులు వారి ప్రాంతాలకు వెళ్లడడంతో పనుల్లో జాప్యం జరిగింది. ఆ తర్వాత పనుల్లో వేగం పెంచారు. ప్రజాభిప్రాయం సేకరణ నిర్వహించిన తర్వాతనే ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని ఎన్జీటీ ఆదేశాల మేరకు నాలుగు రోజుల క్రితం ప్లాంట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్లాంట్ ఏర్పాటుకు ఎలాంటి అభ్యంతరాలూ లేవని ప్రజలు ముకుమ్మడిగా అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక కాంగ్రెస్ శాసన సభ్యుడు బీఎల్ఆర్ కూడా అనుకూలంగా మద్దతు తెలిపి రాజకీయాలకు అతీతంగా అందరూ ప్లాంట్ ఏర్పాటును సమర్థించాలని కోరారు. దీనితో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్లాంట్ పై సానుకూలత వ్యక్తం చేసినట్లయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారు పవర్ ప్లాంట్ పనులపై ప్రత్యే క దృష్టిని పెట్టాల్సిన అవసరం ఉన్నది. ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన నిధులు సమకూర్చి త్వరితగతిన పనులు పూర్తి చేస్తే రాష్ట్రంలో కరెంట్ కోతలను అధిగమించవచ్చని నిపుణులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. నాడు కేసీఆర్ ముందు చూపు నేటి ప్రభుత్వానికి కలిసిరానున్నదని పలువురు చర్చించుకుంటున్నారు.

### నేడు పవర్ ప్లాంట్‌కు ముగ్గురు మంత్రులు

యాదాద్రి పవర్ ప్లాంట్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం రానున్నారు. ప్లాంట్‌లో పనుల ప్రగతిని తెలుసుకొని స్థానిక టీఎస్ జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణ వివరాలు, చేపట్టాల్సిన పనుల గురించి తెలుసుకోనున్నారు. ప్రస్తుతం పవర్ ప్లాంట్‌లో పనులు వేగవంతంగా నడుస్తున్నాయని, రానున్న జూన్ – జూలై వరకు రెండు యూనిట్ల నుంచి విద్యుత్‌ను ప్రారంభిస్తామని యాదాద్రి పవర్ ప్లాంట్ సీఈ సమ్మయ్య తెలిపారు.

## 3న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఫిబ్రవరి 23 :మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానిన విజయవంతం చేయాలని, 5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ దాసరి హరిచందన కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె పల్స్ పోలియో నిర్వహణపై జిల్లా స్థాయి ట్రాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడారు. మార్చి 3న ఏదైనా కారణం చేత చుక్కలు వేయించుకోలేని వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి బృందాలు పోలియో చుక్కలు వేస్తాయని తెలిపారు. నల్లగొండ జిల్లాలో సుమారు 1,54,895 మంది 5 సంవత్సరాల్లోపు చిన్నారులు ఉన్నారని చెప్పారు. పోలియో చుక్కలు వేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 1,070 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4,280 బృందాలు, 107 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి ప్రసాదాన్ని అందజేస్తున్న జాతర నిర్వాహకులు

## చల్లంగ దీవించు తల్లీ..

- వైభవంగా చిన్న మేడారం జాతర
- నేడు వన ప్రవేశంతో ముగియనున్న జాతర

రాజాపేట, ఫిబ్రవరి 23 : మండలంలోని చిన్న మేడారంలో సమక్క–సారలమ్మ జాతర వైభవంగా కొనసాగుతున్నది. నాలుగో రోజు శుక్రవారం వన దేవతలు గద్దెలపై ఆగమనంతో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సల్లంగా దీవించు తల్లి అని వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు వడి బియ్యాలు, పసుపు, కుంకుమ, గాజులతో నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు. వన దేవతలను మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూదిత భిక్షమయ్య గౌడ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి దర్శించుకొని నిర్వహించారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వేణుగోపాల్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



నిలువెత్త బంగారం సమర్పించుకుంటున్న భక్తురాలు



చిన్న మేడారంలో వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

## మేళ్ల చెర్వు జాతరకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వెంకట్రావ్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 23 : మేళ్లచెర్వులోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకు జరుగనున్న మహా శివరాత్రి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ సూచించారు. దేవాలయ ఆవరణలో శుక్రవారం ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి జాతర ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. జాతరకు ఇటీవల మంజూరైన రూ. కోటి నిధులతో ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, శానిటేషన్, క్యూలైన్లతోపాటు పార్కింగ్‌కు వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు, ఫ్లడ్ లైట్లు పెట్టించాలన్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఈఓ గుజ్జుల కొండారెడ్డి, ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు, జడ్పీటీసీ శాగంరెడ్డి పద్మాగోవిందరెడ్డి, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ పరమేశ్, పలు శాఖల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మేళ్లచెర్వు జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే తదితరులు